సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



సందట్లో సడేమియా

ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో క్యాంపు కార్యాలయాలు నిర్మించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు చోట్ల ఫర్నిచర్ మాయమైంది. 8లో▸



జోరుగా ఇసుక అక్రమ రవాణా

జిల్లాలోని ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల మధ్య సమన్వయలోపం ఇసుక వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0 /15.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: 'అసంపూర్తి.. మళ్లీ గడువు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌మణికుమార్ స్పందించారు. గురువారం మందమర్రి పాతబస్టాండ్ వద్ద రోడ్డు నిర్మాణ పనులపై సంబంధిత అధికారులను ఎందుకు జాప్యం జరుగుతుందనే విషయమై అడిగి తెలుసుకున్నారు. గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులు జాప్యం కావడంతో స్థానికంగా ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

13 మందికి ఎస్సైలుగా పదోన్నతి

మంచిర్యాలక్రైం: కాళేశ్వరం జోన్–1 పరిధిలో మూడేళ్ల క్రితం ఎస్సైగా శిక్షణ పొంది ఉత్తీర్ణులైన 13మంది ఏఎస్సైలకు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని 8మంది, కుమురంభీం జిల్లాలో ఐదుగురికి ఎస్సైలుగా పదోన్నతి లభించింది. వీరిలో కాటారపు శ్రీనివాస్, ఓబులమ్మ, భుక్యా రాజం, టీ.జితేందర్‌సింగ్, సీహెచ్.చక్రపాణి, యం.సుధాకర్‌రావు, జీ.బాలకిషన్, డీ.రాజయ్య, కుమురంభీం జిల్లాలో తిరుమల, ఎం.రాములు, పీ.చంద్రమిస్త్రి, ఎం.భోజరావ్, ఆర్.వెంకటేశ్వర్ ఉన్నారు. వీరికి త్వరలో రామగుండం పోలీస్ కమిషర్ రెమా రాజేశ్వరి పదోన్నతి చిహ్నాలను అందజేయనున్నారు.

నేటి నుంచి ఆర్టీసీలో జీరో టికెట్ అమలు



మంచిర్యాల డిపోలో జీరో టికెట్

మంచిర్యాలఅర్బన్: మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం నుంచి జీరో టికెట్ అమలు చేయనుంది. ఇటీవల ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంలో టికెట్ లేకుండానే మహిళలకు అవకాశం కల్పించారు. ఉచిత బస్సు ప్రయాణం పటిష్ట అమలుకు సాఫ్ట్‌వేర్‌ను టిమ్ మెషిన్లలో ఇన్‌స్టాల్ చేశారు. మంచిర్యాల డిపోలో శుక్రవారం ఉదయం 4గంటలకు హైదరాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. మహిళ ప్రయాణికులు ఆధార్, ఓటరు, తదితర గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలని, స్థానికత ధ్రువీకరణ కోసం వాటిని కండక్టర్లకు చూపించి విధిగా జీరో టికెట్లు పొందాలని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. గుర్తింపు కార్డు జిరాక్స్ గాని, ఒరిజినల్, డిజిటల్ కాపీ(సెల్‌ఫోన్‌లో) తప్పనిసరిగా చూపించాలని తెలిపారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని యాపల్ ప్రాంతంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ వైద్య బృందం సభ్యులు గురువారం సందర్శించారు. పరిసరాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రజ్యోతీరావు మాట్లాడుతూ పరిసర ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన అవసరాలు, సౌకర్యాలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందికి పలు సూచనలు చేశారు. డాక్టర్ ప్రదీప్‌కుమార్ చౌదరి, జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా ఆధ్వర్యంలో నాంపల్లి హెల్త్‌కేర్ ఆస్పత్రి సహకారంతో బెటాలియన్ కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, బెటాలియన్ వైద్యులు సంతోష్‌సింగ్, శ్రీధర్, హెల్త్‌కేర్ ఆస్పత్రి వైద్యులు పి.ప్రభాకర్, ఆదిత్య, జహీద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కండువా మార్చిన కౌన్సిలర్లు

- మంచిర్యాలలో క్యూకట్టిన ప్రజాప్రతినిధులు
- బెల్లంపల్లి, నస్పూర్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు
- మిగతా చోట్ల పార్టీ మార్పునకు మంతనాలు
- పట్టణాల్లో పట్టు కోల్పోతున్న బీఆర్ఎస్ పార్టీ



ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రంలో అధికార మార్పు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపైనా పడుతోంది. ఇన్నాళ్లు బీఆర్ఎస్ సర్కారులో ఉన్న కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న మంచిర్యాల పట్టణ పాలకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నుంచి 14మంది ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ చేరారు. గురువారం ఒకే రోజు తొమ్మిది మంది కౌన్సిలర్లు మూకుమ్మడిగా కండువాలు మార్చడం గమనార్హం. గతంలో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఇద్దరు కౌన్సిలర్లు కలిపితే మొత్తంగా 15 మంది పార్టీ మారారు. దీంతో కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్న ప్రజాప్రతినిధుల సంఖ్య 24కు చేరింది. మొత్తం 36వార్డుల్లో మరో 12మంది మాత్రమే బీఆర్ఎస్‌లో మిగిలారు. ఇక నస్పూర్ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో చేరి, తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికలకు ముందే బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు ఐదుగురు కాంగ్రెస్‌లో చేరారు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు. ఆ తర్వాత చైర్‌పర్సన్ శ్వేత కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. అవిశ్వాసంపై ఎలా ముందుకు వెళ్తారో వేచి చూడాలి. ఇక ఎన్నికలకు ముందు చెన్నూరు పట్టణ ఒకటో వార్డు కౌన్సిలర్ పోగుల సతీశ్ కాంగ్రెస్‌లో చేరారు. క్యాతనపల్లి, లక్సెట్టిపేట పరిధిలోనూ కొందరు కౌన్సిలర్ల మధ్య పార్టీ మారితే ఎలా ఉంటుందనే మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం.

ఏడాది కాలానికే..

పట్టణ పాలకవర్గాలు ఏర్పడి వచ్చే జనవరి 26నాటికి నాలుగేళ్లు పూర్తవుతుంది. మరో ఏడాది మాత్రమే ఎన్నికైన వారికి పదవీ కాలం ఉంది. ఈలోపు అవిశ్వాసాలు ప్రవేశపెట్టినా, సర్కారు నిర్వహించే కార్యక్రమాలకు ఇబ్బంది ఉండదనే కోణంలో పార్టీ వీడుతున్నారు. ఇక అధికార పార్టీ నాయకుల నుంచి తమ రాజకీయ భవిష్యత్‌ను కాపాడుకునేందుకు కూడా గోడ దూకేస్తున్నారు. ఏడాది కాలానికే పదవీకాలం ఉన్నప్పటికీ వచ్చే ఐదేళ్ల ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలతో అధికార పార్టీలోనే ఉండే అవకాశం ఉంది. దీంతో అంతా ఆలోచించుకునే కండువాలు మార్చేస్తున్నారు. ఒకవేళ అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టినా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు ఎన్నిక సమయంలోనూ కొత్తగా ఎన్నికయ్యే వర్గంలోనే ఉండొచ్చనే ముందస్తు ఆలోచనతో ఉన్నారు. ఇక బీఆర్ఎస్‌లో ఉన్న ఎమ్మెల్యేలు మాజీలుగా మారడంతో తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగాలన్నా, నిధులు తెచ్చుకోవాలన్నా, కొత్త ఎమ్మెల్యేగా ఉన్న పార్టీలో చేరితేనే మేలని భావిస్తున్నారు. తమ వార్డు కౌన్సిలర్లు పార్టీ మారడంపై స్థానికుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు పార్టీ మారడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు గురువారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 7వ వార్డు కౌన్సిలర్ బదావత్ ప్రకాశ్‌నాయక్, 9వ వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునిత, బొలిశెట్టి కిషన్, 19వ వార్డు కౌన్సిలర్ వంగపల్లి అనిత, వంగపల్లి రవీందర్‌రావు, 22వ వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి, మెరుగు శ్రీనివాస్, 25వ వార్డు కౌన్సిలర్ మీనాజ్, 26వ వార్డు కౌన్సిలర్ నాంపల్లి మాధవి, శ్రీనివాస్, 27వ వార్డు కౌన్సిలర్ సిరికొండ పద్మ, కొండల్‌రావు, 34వ వార్డు కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు ఖాజామియా, బోధ ధర్మేందర్, తూముల ప్రభాకర్ కాంగ్రెస్‌లో చేరారు.

ఫలించని 'మాజీ'ల మంత్రాంగం

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్(జన్నారం) నాలుగు స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఈ ఫలితాలతో చావు దెబ్బ తిన్న బీఆర్ఎస్ పార్టీకి, తాజాగా కౌన్సిలర్లు మార్పుతో మరింత బలహీన పడుతోంది. స్థానికంగా నాయకత్వ లేమితో పార్టీ పట్టుకోల్పోతోంది. మొదట పార్టీ మారకుండా మాజీ ఎమ్మెల్యేలు మంత్రాంగం నడిపినా.. అవేవీ ఫలించడం లేదు. అధికారంలో లేకపోవడంతో తమ దారి తాము చూసుకుంటామని చెబుతూ అధికార పార్టీలోకి జంప్ అవుతున్నారు. దీంతో వరసగా జరగబోయే పంచాయతీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బంది కలుగనుంది. మరోవైపు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చేజారడంతో కేడర్‌లోనూ అయోమయం నెలకొంది. పట్టణాల్లో కౌన్సిలర్లు పార్టీ మారుతుండడంతో ముఖ్య నాయకులు, కార్యకర్తలు సైతం అదే దారిలో వెళ్తున్నారు. దీంతో 'కారు' పార్టీ తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

మంచిర్యాలలో అవిశ్వాసానికి సన్నద్ధం..!

- బల్దియాలో తగ్గిన బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య
- 23కు చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో అవిశ్వాసానికి కౌన్సిలర్లు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. శుక్రవారం 24మంది కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేయనున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఇద్దరూ బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన వారే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, రాష్ట్రంలోనూ ఆ పార్టీ అధి కారంలోకి వచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీ లోకి పలు పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకుల చేరికలు ప్రతీరోజు కొనసాగుతున్నాయి. 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరగ్గా బీఆర్ఎస్ పార్టీ నుంచి 21 మంది, కాంగ్రెస్ నుంచి 14 మంది, ఒకరు స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఐదుగురు, స్వతంత్ర అభ్యర్థి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ బలం 27కు చేరింది. ఇటీవల మారిన రాజకీయ సమీకరణాలతో ఒకరు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరగా, 14 మంది కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బల్దియాలో బీఆర్ఎస్ పార్టీ బలం 12కు, కాంగ్రెస్ పార్టీ బలం 23కు చేరింది. చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం కోసం నోటీసును అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన మరి కొందరు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల తర్వాత మంచిర్యాలకు రానున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును కలిసి కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపికపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

అల్పాహారం.. అస్తవ్యస్తం..!



మంచిర్యాల జవహర్‌నగర్ పాఠశాలలో అల్పాహారానికి నోచుకోని విద్యార్థులు

- డిసెంబర్ నుంచి 'బ్రేక్'ఫాస్ట్
- బిల్లులు రాలె.. పాత్రలు లేవు
- ఏజెన్సీ నిర్వాహకులకు ఇబ్బందులు



న్యూగర్మిళ్ల పాఠశాలలో అల్పాహారం

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడిలో విద్యార్థులకు అందించే సీఎం బ్రేక్‌ఫాస్ట్(అల్పాహారం పథకం) అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో మొదట్లో సాఫీగా సాగిన అల్పాహారం పథకం పూర్తిస్థాయి మోనూ ఎక్కడ అమలు కాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో మెజార్టీ పాఠశాలల్లో డిసెంబర్ 2నుంచి అల్పాహారం పథకం నిలిచిపోయింది. పెండింగ్ బిల్లులు మంజూరు కాక, విధివిధానాలు లేకపోవడంతో కొనసాగింపుపై సందిగ్ధత ఏర్పడింది. అల్పాహారం నిధులపై ఇప్పటివరకు ఎలాంటి జీవో విడుదల కాకపోవడం.. నిధులూ మంజూరు కాకపోవడంతో వంట నిర్వాహకులు విముఖత చూపుతున్నారు. దసరాకు ఒకరోజు ముందుగా జిల్లాలో నియోజకవర్గానికి ఒక్క పాఠశాలల్లో పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. మంచిర్యాల నియోజకవర్గంలో న్యూగర్మిళ్ల పాఠశాల, చెన్నూర్ నియోజకవర్గంలో మందమర్రి ఫిల్టర్‌బెడ్ ఎంపీపీఎస్, బెల్లంపల్లి నియోజకవర్గంలో బెల్లంపలి 2ఇంక్లైన్ ఎంపీపీఎస్‌ల్లో పథకాన్ని ప్రారంభించారు. మరో 36 స్కూళ్లలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ అమలుకు నిర్ణయించారు. కొన్ని పాఠశాలల్లో రెండు నెలలు, మరికొన్ని పాఠశాలల్లో నెలకు సంబంధించిన బిల్లులు మంజూరుకాకపోవడంతో నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

పట్టిక ఇలా..

పిల్లల్లో పోషకాహార లోపం, తరగతి గదిలో గైర్హాజరు నివారించడం, హాజరు నమోదు పెంచడానికి ప్రభుత్వం అల్పాహార పథకాన్ని అమలు చేస్తోంది. ఒక్కో విద్యార్థికి రూ.10.50 చొప్పున కేటాయించనున్నట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు నిధుల మంజూరుపై స్పష్టత లేకుండా పోయింది. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు 45 నిమిషాల ముందుగా అల్పాహారం అందించాల్సి ఉంటుంది. సోమవారం ఇడ్లీ, సాంబారు లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం పూరి, ఆలుకూర్మా, లేదా టోమాటో బాత్, సాంబార్, బుధవారం ఉప్మా, సాంబారు లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ, సాంబారు లేదా పొంగల్, సాంబారు, శుక్రవారం ఉగ్గని, అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ, లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, శనివారం పొంగల్, సాంబారు లేదా కూరగాయల పులావ్, పెరుగు చట్నీ, ఆలుకుర్మా అందించాలి. ప్రభుత్వం నుంచి విధివిధానాలు ఖరారు కాకపోవడంతో మోనూ ప్రకారం అందించిన దాఖలాలు తక్కువే. కొన్ని చోట్ల పూరి ఉంటే ఇడ్లీ లేదు. ఉప్మా, కిచిడీ వంటివాటితో నెట్టుకువచ్చినట్లు చెబుతున్నారు.

నిలిచిన అమలు

అల్పాహారం అమలుపై గురువారం పలు పాఠశాలల్లో 'సాక్షి' ఆరా తీయగా ఎంపికైన మెజార్టీ పాఠశాలల్లో పథకం అమలు కావడం లేదని తేలింది. మంచిర్యాల పట్టణంలోని జవహర్‌నగర్ పాఠశాలలో 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్‌కు మధ్యాహ్న భోజనం నిర్వాహకులు రాకపోవడంతో ఓ హోటల్ నుంచి తెప్పించి అల్పాహారం అందించారు. నిధులు రాకపోవడంతో డిసెంబర్ నుంచి మానేశారు. ఓల్డ్ మంచిర్యాల నిర్మల్ రోడ్ స్కూల్‌లో కూడా డిసెంబర్ నెలలో విధివిధానాలు రాకపోవడం.. బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో తెలియక నిర్వాహకులు అల్పాహారానికి దూరంగా ఉంటుందన్నారు. దొనబండ, కర్ణమామిడి, సంఘమల్లయ్య పల్లె పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్కే–6 ఎంపీపీఎస్ పాఠశాల, మంచిర్యాల న్యూగర్మిళ్ల పాఠశాలల్లో మాత్రం అల్పాహారం పథకాన్ని నెట్టుకొస్తున్నారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంపై స్పష్టతతోపాటు మార్గదర్శకాలు, నిధులు మంజూరు చేస్తేనే ముందుకు సాగే పరిస్థితులు ఉన్నాయి. ఇదే విషయమై సెక్టోరల్ అధికారి చౌదరిని సంప్రదించగా అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలవుతోందని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్‌కు సంబంధించి నిధులు ఎంత అవసరమో వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలోనే బడ్జెట్ మంజూరు కానుందని పేర్కొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- దివ్యాంగులకు క్రీడాపోటీలు



పోటీలను తిలకిస్తున్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాలటౌన్: దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటలపోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో దివ్యాంగులు అనేక రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, ఇదే స్ఫూర్తితో జిల్లాలోని దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. క్రీడాకారులతో కలిసి చదరంగం, క్యారమ్ ఆటలు ఆడారు. పరుగుపందెం, షాట్‌పుట్, చెస్, క్యారం, జావెలిన్ త్రో, మ్యూజికల్ చైర్ పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. విజేతలకు ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.చిన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా క్రీడా యువజన సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వయోజన విద్య అధికారి పురుషోత్తం, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, దివ్యాంగుల సంఘాల నాయకులు మహేందర్, తిరుపతి, సతీశ్, భాగ్య పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



విద్యార్థిని సుధీష్ణను అభినందిస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ స్థానిక సంస్థల యాజమాన్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు విద్య కార్యక్రమాల అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉన్నతి లక్ష్య కార్యక్రమాలతోపాటు వివిధ రకాల పథకాల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా పదోన్నతి పొందిన 45 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. గతంలో జిల్లాలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి ఇతర జిల్లాలకు వెళ్లిన ఎనిమిది మందిని, ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన నలుగురిని సన్మానించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని సుధీష్ణ 120 పనిదినాలకు 120 రోజులు హాజరైనందుకు డీఈవో ప్రత్యేకంగా అభినందిస్తూ జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యనారాయణమూర్తి, కో–ఆర్డినేటర్ యశోధర, డీఎస్‌వో మధుబాబు పాల్గొన్నారు.

వ్యాసెక్టమీపై అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు



కరపత్రాలు విడుదల చేస్తున్న జిల్లా వైద్యాధికారి

మంచిర్యాలటౌన్: వ్యాసెక్టమీ ఆపరేషన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. వ్యాసెక్టమీ అవగాహన శస్త్రచికిత్సల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈ నెల 11 నుంచి 24వరకు నిర్వహించే వ్యాసెక్టమీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల అవగాహన కరపత్రాలను డీఎంహెచ్‌వో కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలనే దానిపై వైద్య సిబ్బందికి వివరించారు. మగవారికి చేసే వ్యాసెక్టమీ ఆపరేషన్ సులువుగా ఉంటుందని, ఐదు నిమిషాల్లోనే ఆపరేషన్‌ను పూర్తి చేస్తారని, అపోహలను వీడేలా ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ ఏడాది 'కుటుంబ నియంత్రణలో పురుష భాగస్వామ్యం అందిస్తుంది తల్లీబిడ్డలకు ఆరోగ్యం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. డెమో బుక్క వెంకటేశ్వర్, ఎస్‌వో వెంకటేశ్వర్లు, ఏఎస్‌వో దామోదర్, ఎల్‌డీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలకు పంపించాలి




తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ

జన్నారం: మారుమూల గిరిజన గ్రామాల్లోని విద్యార్థులను చదివించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో పాఠశాలలు నిర్వహిస్తున్నామని, పిల్లలను క్రమం తప్పకుండా పంపించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గంగరాం అన్నారు. గురువారం మండలంలోని మొర్రిగూడ గ్రామ పంచాయతీ పరిధి గొండుగూడ ఐటీడీఏ పాఠశాల పిల్లలు లేక నడపడం లేదని తెలుసుకుని తిరిగి ప్రారంభించారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా నడుస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. సర్పంచ్ గోపాల్, ఏసీఎంవో రాజమౌళి, ప్రత్యేక అధికారి శంకర్, ఎస్సీఆర్పీ రఘునాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాసనసభ్యుడిగా ఎన్నికైన నేను..



నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన నలుగురు గురువారం శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బీజేపీ నుంచి ఎన్నికైన విషయం తెలిసిందే. ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారానికి నిరాకరించి దూరంగా ఉన్నారు. గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో అసెంబ్లీలో ప్రమాణం చేశారు. ముగ్గురు తెలుగులో, రామారావు పటేల్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. - భైంసాటౌన్

క్లుప్తంగా

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని మసాల ఒర్రె వద్ద గురువారం పట్టాలపై నిలబడి ఉండడంతో కరీంనగర్-సిర్పూర్(టి) ప్యాసింజర్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. మృతురాలి వయస్సు దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని, పంజాబీ డ్రెస్ ధరించి ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మతిస్థిమితం బాగాలేక రైలు వస్తుండగా ఎదురుగా పట్టాలపై నిలబడి ఉన్నట్లు రైలు డ్రైవర్ సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్


కోట్నాక విజయ్‌కుమార్

ఆసిఫాబాద్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుమురంభీం జిల్లాకు చెందిన కోట్నాక విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. గురువారం హన్మకొండలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులు, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోడమీది రాతలు తొలగింపు


వాల్ రైటింగ్ తొలగించిన యాజమాన్యం

సాక్షి స్పందన

మందమర్రిరూరల్: 'సింగరేణి గోడలపై యూనియన్ రాతలు' శీర్షికన ఈ నెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి యాజమాన్యం స్పందించింది. కేకే–5 గని క్యాంటీన్ గోడపై ఏఐటీయూసీ యూనియన్ పేరిట రాసిన వాల్ రైటింగ్‌ను గురువారం తొలగించింది. అంతేకాకుండా యూనియన్ పిట్ కార్యదర్శికి నోటీస్ కూడా ఇచ్చినట్లు సమాచారం. మరికొన్ని చోట్ల కూడా గోడలపై రాతలు అలానే ఉన్నాయి.

ఇష్టపడి చదివితే మంచి మార్కులు

మంచిర్యాలఅర్బన్: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని డీఐఈవో శైలజ అన్నారు. గురువారం మంచిర్యాల కేజీబీవీని సందర్శించారు. ల్యాబ్‌తో పాటు తరగతి గదుల్లో బోధన పరిశీలించి బాలికలతో ముచ్చటించారు. విద్యార్థులు మంచిమార్కులు సాధించేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థుల హాజరు, ప్రగతిపై చర్చించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

సందట్లో సడేమియా!

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో ఫర్నిచర్ మాయం
- చాలా కార్యాలయాల్లో కనిపించని ఫైనం
- ఎత్తుకెళ్లారంటున్న కాంగ్రెస్ నేతలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు

సాక్షి విజిట్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిట్టింగులంతా ఓడిపోయారు. దీంతో నియోజకవర్గ కార్యాలయాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదునుగా భావించిన కొంతమంది క్యాంపు కార్యాలయాల్లో ఫర్నిచర్ అపహరించుకుపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని ఫర్నిచర్ మాయమైంది. కొన్ని కార్యాలయాల్లో తాము సొంత దబ్బులతో ఫర్నిచర్ ఏర్పాటు చేశామని, అందుకే తీసుకెళ్లామని తాజా మాజీలు చెబుతున్నారు. ఇదే నిజమైతే రహస్యంగా తరలించడం ఏంటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మంచిర్యాలలో...

మంచిర్యాలటౌన్: ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే నడిపెల్లి దివాకర్‌రావుకు ఓటమి దిశగా ఫలితాలు రావడంతో అతని అనుచరులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని టీవీ, ఫ్రిడ్జ్, రెండు ఏసీలు, 100కు పైగా కుర్చీలు, ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రి తీసుకెళ్లారు. గెలిచిన ఎమ్మెల్యేకు క్యాంపు కార్యాలయాన్ని అందించడంలో తాత్సారం జరుగుతుండడంతో భవనానికి ఆర్డీవో కార్యాలయ అధికారులు తాళం వేసి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. కానీ అప్పటికే సామగ్రి తరలిపోయింది. ఉన్న సామగ్రినైనా కాపాడుకోవాలని అధికారులు ఆలస్యంగా మేలుకుని తాళం వేశారు. ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన వాటిని ఎత్తుకెళ్లడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్లంపల్లిలో...

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బెల్లంపల్లి ఎమ్మెల్యే కూడా మారారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కొద్దిరోజుల క్రితం ఖాళీ చేశారు. కానీ కార్యాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు ఏసీలు, ఫ్యాన్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మిగతా సోఫాసెట్స్, డైనింగ్ సెట్, కుర్చీలు, బెడ్‌లు కానరావడంలేదు. కార్యాలయాన్ని ఖాళీ చేసే సమయంలో పట్టుకెళ్లారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


మంచిర్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

చెన్నూర్‌లో...

చెన్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఓడిపోయారు. దీంతో క్యాంపు కార్యాలయంలో తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సామగ్రిని ఇటీవల తీసుకెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సామగ్రి చోరీకి గురైందని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రభుత్వం సమకూర్చిన రెండు ఏసీలు, మూడు గీజర్లు, ఫ్యాన్లు, లైట్లు ఉన్నట్లు గుర్తించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నేటికీ క్యాంప్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోలేదు. ప్రస్తుతం అధికారుల ఆధీనంలోనే ఉందని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు.

కాగజ్‌నగర్‌లో...

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కాపువాడలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని గురువారం 'సాక్షి' విజిట్ చేయగా ఫర్నిచర్, తలుపులు, కిటికీలతో పాటు ఇతర సామగ్రి సైతం ఉపయోగకరంగా ఉన్నాయి. బుధవారం కార్యాలయాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు అప్పగించినట్లు ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రమోద్ కుమార్ తెలిపారు.

బోథ్‌లో...

ఇచ్చోడ(బోథ్): బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఫర్నీచర్ నాలుగు నెలల ముందే మాయమైంది. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం టికెట్ నిరాకరించింది. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌కు టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ముందస్తుగానే ఆగస్టు 24న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఫర్నీచర్, ఇతర విలువైన వస్తువులను అర్ధరాత్రి ఆదిలాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై అప్పట్లో ప్రతిపక్షనేతలు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌ను వివరణ కోరగా అప్పట్లో తాను లేనని, ఈ విషయం తనకు తెలియదన్నారు.

ఓసీలో స్థానికులకే ఉద్యోగం ఇవ్వాలి


ధర్నా చేస్తున్న యువకులు

జైపూర్(చెన్నూర్): శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఓసీలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలువురు యువకులు వోల్వోలను అడ్డుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు అరికె సంతోష్ మాట్లాడుతూ ఇటీవల కాంట్రాక్ట్ దక్కించుకున్న వరాహ కంపెనీ యాజమాన్యం స్థానికులను తొలగించి ఇతరులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని ఆరోపించారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఓసీ పీవో స్పందించి స్థానికులకు అవకాశం కల్పించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఇండియన్ మిలిటరీ క్యాంపునకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ పానుగంటి అఖిల్ ప్రతిష్టాత్మక ఇండియన్ మిలిటరీ అకాడమీ క్యాంపునకు ఎంపికయ్యాడు. ఈ నెల 17నుంచి 27 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే క్యాంపులో పాల్గొనున్నారు. గురువారం ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్, అధ్యాపకులు అభినందించారు.

హక్కుల కోసం హెచ్‌ఎంఎస్ రాజీలేని పోరాటం

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న హెచ్‌ఎంఎస్‌ను కార్మికులంతా ఆదరించి గెలిపించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ, ఏరియా స్టోర్స్‌లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపిస్తే కార్మికులకు సొంతింటి పథకం, కొత్త గనుల ఏర్పాటు, క్యాడర్ స్కీం అమలు, డిపెండెంట్ ఉద్యోగాలు కొనసాగింపు, మహిళా కార్మికులకు విద్యార్హతను బట్టి పదోన్నతలు కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకూ గెలిచిన సంఘాలన్నీ యాజమాన్యం ఇచ్చే ఉచిత మస్టర్లకు ఆశపడి కార్మిక హక్కులను తాకట్టు పెట్టాయన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు హెచ్‌ఎంఎస్‌లో చేరారు. సమావేశంలో పత్తెం రాజాబాబు, ఓజియార్, బోనాల శ్రీనివాస్, నీరటి రాజన్న, దేవి సత్యం, ఇనూస్, దత్తు, శ్రీనివాస్, ఆరీఫ్, కిష్టస్వామి, వసీం, ఉమామహేశ్వరరావు, రాజు, భిక్షపతి, దేవ్‌సింగ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలు చేస్తాం


మాట్లాడుతున్న కలవేన శ్యాం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో తాము గెలిస్తే 45 డిమాండ్లతో కూడిన మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, కలవేన శ్యాం అన్నారు. గురువారం ఆర్కే7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ ప్రతీ హామీని నెరవేరుస్తామన్నారు. కార్మికులకు అనేక హక్కులు సాధించిన చరిత్ర ఐఎన్‌టీయూసీకే ఉందని, ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్, ఏఐటీయూసీకి చెందిన పలువురు ఐఎన్‌టీయూసీలో చేరారు. సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, కేంద్ర కార్యదర్శులు మోత రాఘవరెడ్డి, సమ్ము రాజయ్య, శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, బ్రాంచ్ నాయకులు సమ్మిరెడ్డి, కొలిపాక సమ్మయ్య, రౌతు శ్రీనివాస్, నర్సింగ్, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణిలో రాజకీయ జోక్యం అడ్డుకుంటాం'


మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): గుర్తింపు ఎన్నికల్లో తాము గెలిస్తే సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని అడ్డుకుంటామని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య అన్నారు. గురువారం ఆర్కే 5, ఆర్కే న్యూటెక్ గనులపై జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాల కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్మికులకు 250 గజాల ఇంటిస్థలం, కోలిండియా మాదిరి అలవెన్స్‌లపై ఇన్కమ్ ట్యాక్స్ మినహాయింపు, నూతన గనులు తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు యువ కార్మికులు యూనియన్‌లో చేరారు. సమావేశంలో మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్ సంపత్, ప్రసాద్‌రెడ్డి, సారయ్య గునిగంటి నరసింహారావు, ఆకుల లక్ష్మణ్, అఫ్రోజ్‌ఖాన్, రాంచందర్, విశ్వనాథ్‌రెడ్డి, భోగ మధునయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.18 కోట్లతో 'ఉపాధి' పనులు


ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో శేషాద్రి

దండేపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు రూ.2.18 కోట్లతో వివిధ రకాల పనులు చేపట్టినట్లు డీఆర్‌డీవో శేషాద్రి తెలిపారు. 13వ విడత సామాజిక తనిఖీలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పలు గ్రామాల్లో కాల్వలు, చెరువుల్లో పూడిక తీత పనులు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, ఆయిల్‌పాం తోటల నిర్వహణ, ఫిష్‌పాండ్‌లు, హరితహారం పనులు చేపట్టినట్లు వివరించారు. ఇందుకుగానూ రూ.2.11కోట్లు కూలీల వేతనం కింద, రూ.7లక్షలు మెటీరియల్‌కు ఖర్చు చేసినట్లు తనిఖీ సభ్యులు తెలిపారు. మస్టర్లు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా చేపట్టని కార్యదర్శులకు రూ.4 వేల పెనాల్టీ విధించగా, లెక్కల్లో తేడా కింద రూ.7,063, రికవరికీ డీఆర్‌డీవో ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో కూలీల సంతకం తీసుకోకుండానే పేమెంట్ చేసినట్లు తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ దత్తరావు, అంబుడ్స్‌మెన్ శివరామ్, విజిలెన్స్ అధికారులు సురేష్, కిరణ్, క్వాలిటీ కంట్రోల్ అధికారి చంద్రశేఖర్, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీడీవో మల్లేశం, ఏపీవో దుర్గదాస్ పాల్గొన్నారు.

కేవీకే శిక్షణ తరగతుల్లో ఎంపీపీ వీరంగం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రాంగణంలో చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి రైతులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో గురువారం ఎంపీపీ గోమాస శ్రీనివాస్ వీరంగం సృష్టించారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... శిక్షణలో నైపుణ్యం కనబర్చిన రైతులకు జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు తొంగల సత్యనారాయణ ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎంపీపీ శ్రీనివాస్ వచ్చి తనను ఎందుకు ఆహ్వానించలేదని ఆగ్రహం వ్యక్తం చేశా రు. శుక్రవారం జరుగనున్న ముగింపు కార్యక్రమానికి ఆహ్వానించాలని ప్రిపేర్ అయ్యామని కేవీకే శాస్త్రవేత్తలు సమాధానం చెబుతున్నా పట్టించుకోకుండా దుందుడుకు తనం ప్రదర్శించడంతో రైతులు నిశ్చేష్టులయ్యారు.

వృద్ధులకు భద్రత

- నిరాదరణకు గురయ్యే వారికి అండ
- సహాయం కోసం వాలంటీర్ కమిటీలు
- ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఒకటి లేదా రెండు కమిటీలు
- సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు


జిల్లా కేంద్రంలోని వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య సభ్యులు

మంచిర్యాలక్రైం: మలిసంధ్యలో కనీసం పలకరింపు లేక వయో వృద్ధులు పరితపిస్తున్నారు. నానాటికీ అంతరిస్తున్న మానవ సంబంధాలు వృద్ధుల మానసిక సంఘర్షణకు కారణమవుతున్నాయి. కన్నబిడ్డల కర్కశ హృదయం వల్ల పండుటాకులు రోడ్డున పడుతున్నారు. కొన్నిచోట్ల ఆస్తి తగాదాలతో కన్నబిడ్డలే కడతేర్చిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత వేదనలోనూ తమబిడ్డలకు మాత్రం ఈగతి పట్టకూడదనే పరితపిస్తుంటారు. వయసు పైబడిన వారు ఇంట్లో ఉంటే ఆ ఇల్లు అన్ని విధాలుగా సుభిక్షంగా ఉంటుందనే సత్యాన్ని చాలామంది మరిచిపోయారు. వారి అనుభవాలు నేటితరానికి మార్గదర్శకమవుతాయన్న ఆలోచన కూడా చేయడంలేదు. ఇలాంటి తరుణంలో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సీనియర్ సిటిజన్ల ప్రాణ, ఆస్తుల రక్షణకు పోలీసుల బాధ్యతలో భాగంగా వృద్ధ తల్లిదండ్రుల, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం 2007 నియమాలు 2011 ప్రకారం వారికి భద్రత కల్పించేందుకు ఈ ఏడాది సెప్టెంబర్ 16న సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కమిషనరేట్ పరిధిలోని ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక వాలంటీర్ కమిటీలను ఏర్పాటు చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఇప్పటి వరకు 40 కమిటీలు ఏర్పాటయ్యాయి.

కమిటీలో ఎవరెవరుంటారు? ఏంచేస్తారు?

మంచిర్యాల జిల్లాలో ప్రతీ పోలీస్ స్టేషన్‌కు ఒక కమిటీ చొప్పున ఇప్పటి వరకు 24 వాలంటీర్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సీనియర్ సిటిజన్ సభ్యుడు ఒకరు, గుర్తింపు పొందిన ఎన్‌జీవో సభ్యుడు ఒకరు, ప్రభుత్వ కమిటీలలో ఏదైనా ఒకదానిలో సభ్యులుగా ఉన్న మహిళా సభ్యురాలు (ఉదాహరణకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ), యూనిఫామ్ సర్వీస్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన వ్యక్తితో కలిపి కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీస్ అధికారులు తరచూ వాలంటీర్‌లతో కలిసి సీనియర్ సిటిజన్ల నివాసాలకు వెళ్లి వారిని కలిసి పలకరిస్తారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. ఏమైనా సమస్యలు వారి దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తారు. వాలంటీర్‌లు సీనియర్ సిటిజన్లను నిరంతరం పర్యవేక్షిస్తారు.

కమిటీల పనితీరుపై సీపీ సమీక్ష

జిల్లాలో ఏర్పాటైన 24 కమిటీలు, పోలీస్ అధికారుల పనితీరును రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి నెలనెలా సమీక్షించనున్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్లకు వ్యతిరేకంగా చేసిన నేరాలకు సంబంధించిన అన్ని ముఖ్యమైన వివరాలతో కూడిన ప్రత్యేక రిజిస్టర్‌ను వాలంటీర్ కమిటీలు నిర్వహించాల్సి ఉంటుంది. వారి పిల్లలు, బంధువులు లేదా చట్టపరమైన వారసుల పేర్లతోపాటు వారిని తరచూ కలిసి వివరాలు నమోదు చేయాలి. సీనియర్ సిటిజన్లపై జరిగిన నేరాల వివరాలు నెలవారీ నివేదికను ప్రతినెల 10వ తేదీలోగా సీపీకి అందజేయాలి. పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసినప్పుడు సీనియర్ సిటిజన్లకు సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేస్తారు. గత నెలలో వారి సమస్యలు, పరిష్కరించిన విధానం, నేరాల స్థితి, పురోగతితో సహా నమోదైన నేరాల విచారణ, వాటిపై తీసుకున్న చర్యలపై సీపీ సమీక్షిస్తారు.

వయోవృద్ధుల భద్రత కోసమే..



నేటి రోజుల్లో వయోవృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు. కుమారులు, కూతుర్లు ఉన్నవారు సైతం అనాథాశ్రమాల్లో ఉండి మానసిక్షోభ అనుభవిస్తున్నారు. ఆస్తుల రక్షణ, ఆరోగ్య సమస్యలు, పూర్తిస్థాయి భద్రత కల్పిస్తూ ఎవరూ నిరాదరణకు గురికావద్దు.. మీకు మేమున్నామంటూ భరోసా కల్పించడమే లక్ష్యంగా వాలంటీర్ కమిటీలను ఏర్పాటు చే శాం. ఎన్నికల నేపథ్యంలో అమలులో కొంత ఆలస్యమైంది. పూర్తిస్థాయిలో కమిటీలతో సమీక్షించి కార్యాచరణ ప్రణాళిక ప్రారంభిస్తాం.

– రెమా రాజేశ్వరి, సీపీ, రామగుండం పోలీస్ కమిషనరేట్

'ఏఐటీయూసీని గెలిపిస్తే 250 గజాల ఇంటిస్థలం'


కైరిగూడలో మాట్లాడుతున్న సమ్మయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే కార్మికులకు 250 గజాల ఇంటిస్థలంతో పాటు రూ.20లక్షల వడ్డీలేని రుణం ఇప్పిస్తామని యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య అన్నారు. బెల్లంపల్లి ఏరియా లోని కైరిగూడ ఓసీపీలో గురువారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ఎనలేని హక్కులు సాధించిన చరిత్ర ఏఐటీయూసీది మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా ఓసీపీకి చెందిన పలు వురు కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. సమావేశంలో గోలేటి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిళి, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, రాజేశ్, దివాకర్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు పట్టించుకోని అధికారి

- ఆర్టీఐ కార్యకర్త నోముల రాజేందర్


హైకోర్టు కాపీని అందజేస్తున్న రాజేందర్

ఆసిఫాబాద్: తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను జిల్లా ఉపాధి కల్పనాధికారి పట్టించుకోవడంలేదని సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న మందమర్రికి చెందిన ఆర్టీఐ కార్యకర్త నోముల రాజేందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లాలోని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అవినీతిపై సమాచారం కోసం ఆర్టీఐ కింద ఏప్రిల్ 10న దరఖాస్తు చేశానని, ఇందుకు సంబంధించిన కాపీలకు రూ.16 వేలు చెల్లించినప్పటికీ సమాచారం ఇవ్వక పోవడంతో హైకోర్టును ఆశ్రయించగా తనకు పూర్తి సమాచారం ఇవ్వాలని గత నెల 28న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి వెళ్లి సమాచారం ఇవ్వాలని కోరినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై జిల్లా ఉపాధి కల్పనాధికారిపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తానన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు ఉత్తర్వు కాపీని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బానుకు అందజేశారు.

విప్లవ సంఘాలే ప్రత్యామ్నాయం

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి విప్లవ కార్మిక సంఘాలే ప్రత్యామ్నాయమని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం టీజీఎల్‌బీకేఎస్, జీఎల్‌బీకేఎస్, ఎస్‌జీఎల్‌బీకేఎస్‌లతో కూడిన విప్లవ కార్మిక సంఘాల కూటమి తరపున విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ఎంతో కీలకమైనవన్నారు. సింగరేణిలో జాతీయ సంఘాలు, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ సంస్థను పరిరక్షించడంలో, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సింగరేణిలో ఒకప్పుడు 1,16,000 మంది ఉద్యోగులు ఉంటే ఇప్పుడు వారి సంఖ్య 39,748కు చేరిందనీ ఇందుకు ఆసంఘాల వైఫల్యమే కారణమన్నారు. ఎన్నికల్లో చక్రంలో సుత్తి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కూటమి నాయకులు చాంద్ పాషా, జీ.రాములు, ఐ.కృష్ణ, పోచమల్లు, సీతారామయ్య, బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.